క్లుప్తంగా

వరసిద్ధుని సన్నిధిలో సాయి ధరమ్ తేజ్



స్వామి చిత్రపటం అందుకుంటున్న సాయి ధరమ్ తేజ్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు.

నవజాత శిశువుల సంరక్షణపై దృష్టి



మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: నవజాత శిశువుల పెరుగుదల, సంరక్షణపై ఆశావర్కర్లు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. న్యుమోనియా నివారణ కోసం సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వద్ద కనీసం 10 గర్భిణి కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించడంతోపాటు అవసరమైన మందులు పంపిణీ చేయాలన్నారు. రెండు మూడు రోజుల్లో జ్వరం తగ్గకుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి రక్తపరీక్షలు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

మాతా–శిశు సంరక్షణకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్

బంగారుపాళెం: మాతా–శిశు సంరక్షణకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇవ్వాలని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ అన్నారు. మంగళవారం మండలంలోని తుంబకుప్పం పీహెచ్‌సీ సమావేశ మందిరంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. మాతా–శిశు సంరక్షణ, గర్భిణుల నమోదు, బీసీజీ వ్యాక్సిన్ తదితర లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజా ఆరోగ్యంపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సీహెచ్‌ఓ నాగమణి, ఎంపీహెచ్‌ఈఓ రమేష్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు హరికృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి 'ప్రజాపోరు'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై ఈనెల 8–13 వరకు జిల్లాలో నిర్వహించనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేస్తామని, ఇప్పటికే వివిధ సమస్యలను గుర్తించామన్నారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీతో పాటు పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పేదల, యానాదులు భూములు కబ్జా కాకుండా కాపాడాలన్నారు. బోయకొండ బాధితుల సమస్యలు పరిష్కరించాలని, నగరి పవర్‌లూమ్ కార్మికులకు తమిళనాడు తరహాలో 500 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. రెవెన్యూ సర్వేలు అన్ని గ్రామాల్లో చేయాలని, చిత్తూరు–గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 14న అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి, షకీలా తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల కట్టడి ఏనాటికో..?



జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్)



జనావాసంలోకి వస్తున్న గుంపు (ఫైల్)

జిల్లాలో గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనావాసాల మధ్య సంచరిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. యథేచ్ఛగా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అంతేకాకుండా పొలాల వద్ద రైతులపై దాడి చేసి ప్రాణాలు సైతం బలిగొన్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వీటి ధాటికి పొలాలకు వెళ్లేందుకు కూడా రైతులు సాహసించడం లేదు. వీటి దాడుల్లో గత నెల 23న రామకుప్పం మండలం పీఎంకే తాండాలోని రైతు రెడ్డినాయక్ చనిపోయాడు. అలాగే జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో మామిడి, వరిపంట నాశనమైంది.

- పంట, ప్రాణ నష్టాలతో బెంబేలు
- గ్రామీణులకు కంటికి కునుకు కరువు
- ఏనుగుల సంచారంతో భయం..భయం

చిత్తూరు కార్పొరేషన్: తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో ఏనుగులు ఎక్కువగా మూడు ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. గత రెండు వారాలుగా కుప్పం, రామకుప్పంలో 3, పలమనేరులో 6, రాగిమానుపెంటలో 15, కల్లూరు, మంగళంపేటలో 16 చొప్పున మొత్తం 40 ఏనుగులు సంచరిస్తుండడంతో ఈ ప్రాంత వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకప్పుడు తోటలు, పంట పొలాల్లో సంచరించే గజరాజులు ప్రస్తుతం రహదారులు, జనావాసాల్లో తిరుగుతుండడంతో హడలెత్తిపోతున్నారు. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వాటి వల్ల ఏటా పంటలను నష్టపోతున్న రైతులు ప్రాణనష్టం సంభవించకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఉన్న కుంకీ ఏనుగులను రప్పించి బీభత్సం సృష్టిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండుసార్లు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించినప్పటికీ ఇంతవరకు దీనిపై ఎలాంటి కార్యాచరణకు పూనుకోలేదు.

8 కుంకీల కోసం ప్రతిపాదన

జిల్లాలో ఏనుగుల కట్టడికి 8 కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) అవసరమని అటవీశాఖ అధికారులు ప్రతిపాదన పంపారు. వీటిని ఆమోదించి ఎన్ని ఇస్తారో తెలియని పరిస్థితి. అవి వచ్చాక వాటికి ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి బయటకు తీసుకురావాలి. ఈ తతంగమంతా అవడానికి మరింత సమయం పట్టనుంది. జిల్లాలో 120 ఏనుగులు ఉన్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు. ఎక్కువగా అటవీప్రాంతాల చుట్టూ పొలాలు ఉండటంతో మేత కోసం అవి బయటకు వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. 1980 నుంచి ఈ సమస్య ఉన్ననూ 2017 తర్వాత మరింత పెరగడంతో వీటి పరిష్కారం అటవీశాఖకు తలనొప్పిగా మారింది.

అటవీ పనులపై కలెక్టర్‌కు నివేదిక

ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్ 440 కిలోమీటర్లు నిర్మించగా ఇంక 100 కి.మీ నిర్మించాల్సి ఉంది. అదే విధంగా సోలార్ హ్యాంగింగ్ 206 కి.మీ నిర్మించగా మరో 50 కి.మీ పైగా ఏర్పాటు చేయాల్సి ఉంది. అడవి చుట్టుపక్కల ఎత్తు తక్కువగా ఉన్న విద్యుత్ లైన్లు, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు గుర్తించారు. మొత్తం 54 ట్రాన్స్‌ఫార్మర్లకు పైకప్పు వేయాలని, 900 కరెంటు స్తంభాల లైన్ల ఎత్తును పెంచాలని సంరక్షణ చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదించారు.

పరిష్కారం ఎప్పుడో?

ఏనుగుల దాడుల నివారణకు శాశ్వత పరిష్కారం కలగా మిగులుతోంది. ఒక ఏనుగుకు రోజూ 500 కేజీల ఆహారం అవసరం. అడవిలోని 120 ఏనుగులకు అంత మొత్తం మేత దొరకపోవడంతో అవి పంటలను నాశనం చేస్తున్నాయి. అటవీలోనే వారికి మేత సమకూర్చే దిశగా పంటలు సాగు చేసి, గజరాజులు బయటకు రాకుండా సోలార్ ఫెన్సింగ్ వేసి, కారిడార్ ఏర్పాటు చేయాలంటే కోట్లాది రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం చేతులెత్తేస్తోంది. పంట,ప్రాణ నష్టాలకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. పొలాల వద్ద ఉన్న మోటార్లు, షెడ్లను ఏనుగులు ధ్వంసం చేసినా పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కట్టడికి ప్రయత్నిస్తున్నాం



జిల్లాలో ఇటీవల ఏనుగుల దాడులు పెరిగాయి. వాటి కట్టడి కోసం ప్రయత్నిస్తున్నాం. అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు క్షేత్రస్థాయిలో సంరక్షణ చర్యల్లో పాల్గొంటున్నారు. కుంకీల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. అలాగే ఎక్కడెక్కడ రక్షణ చర్యలు అవసరమో వాటి వివరాలను ప్రభుత్వానికి తెలియజేశాం. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు జిల్లా సరిహద్దుగా ఉండటంతో మూడు ప్రాంతాల్లో అవి సంచరిస్తున్నాయి. యథేచ్ఛగా అటు నుంచి ఇటు. మళ్లీ ఇటు నుంచి అటు వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– భరణి, డీఎఫ్‌ఓ

పక్కాగా పశు గణన సర్వే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశుగణన సర్వేను పక్కాగా చేయాలని పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్ ఆదేశించారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీ ప్రాంతంలో మంగళవారం పశు గణన సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు గణన చేయాలని, ప్రతి ఇంటా కచ్చితమైన వివరాలు సేకరించాలన్నారు. అన్ని రకాల జంతువులను లెక్కించి నిర్దేశిత యాప్‌లో వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. దీనిని బాధ్యతగా పూర్తి చేయాలన్నారు.

బంగారుపాళెంలో రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు రూరల్ డివిజన్‌లోని బంగారుపాళెంలో గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఈఈ సురేష్ తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో చైర్మన్‌గా రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్ పాల్గొంటారని, పైపల్లె, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళ్యం, యాదమరి ప్రాంతాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

డీఈ జ్ఞానేశ్వర్ బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం డీఈ జ్ఞానేశ్వర్ రాయచోటికు బదిలీ చేస్తూ మంగళవారం సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో రాయచోటి నిర్మాణ విభాగం డీఈ రెడ్డికుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

రెండు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో మంగళవారం రెండు ఆర్టీసీ సర్వీసులను ఎమ్మెల్యే గురజాల ప్రారంభించారు. చిత్తూరు–నల్లవెంకటయ్యగారిపల్లె, చిత్తూరు నుంచి బెంగుళూరు సర్వీసులకు పూజలు చేసి లాంఛనంగా నడిపారు. ఈ సర్వీసులను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మల్బరీ సాగుపై ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని సెరికల్చర్ ఏడీ మోహన్‌బాబు కోరారు. మండలంలోని కూర్మాయిపల్లె, చిల్లగుండ్లపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. పట్టుపురుగుల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. పట్టుపురుగుల పెంపకం, షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ పథకాల వివరాలను తెలియజేశారు. డ్రమ్ సీడర్ పద్ధతితో వరి సాగు చేస్తే కలిగే ప్రయోజనాలను జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ రైతులకు అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దీప, మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, ఏఈఓ సాదరయ్య, ఎస్‌ఓ వెంకటలక్ష్మి, టీఓ గణేష్‌గౌడ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయిజ, ఎగువమూర్తి, అనిల్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాజేంద్రనాయుడు, జ్ఞానశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



హాజరైన రైతులు, అధికారులు

తవణంపల్లె: ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి జె. మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని దిగువమాఘంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించే పంటలను ఆహారంగా తీసుకొంటే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయమే శ్రేయస్కరమని, రసాయనిక ఎరువులతో పండించిన వ్యవసాయోత్పత్తుల వినియోగంతో కాలక్రమంలో రుగ్మతలు తప్పవన్నారు. చిత్తూరు డివిజన్ వ్యవసాయ సంచాలకులు డి. ఉమా మాట్లాడుతూ, నత్రజని ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం అధికంగా వాడాలన్నారు. పశువులకు వ్యాపించే రోగాలు, వాటి నివారణ గురించి రైతులకు మండల పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య, అలాగే ఉద్యాన శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి ఉద్యాన అధికారి సాగరిక వివరించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, ప్రకృతి వ్యవసాయం విభాగం డివిజన్ ఎస్‌పీఎం ఎంటి సుధాకర్‌నాయుడు, ఏపీసీఎన్‌ఎఫ్ తవణంపల్లె మండల యూనిట్ ఇన్‌చార్జ్ సరిత, దిగువమాఘం సర్పంచ్ గోపి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



గుడిపాలలో..

గుడిపాల: మండలంలో పలు గ్రామాల్లో నాగుల చవితిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పుట్టలకు పాలుపోసి మొక్కులు చెల్లించారు. కొంతమంది చీరసారెలు సమర్పించి, రక్షా కంకణం ధరించారు.

చిత్తూరులో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో మంగళవారం నాగుల చవితని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంతపేట, ఇందిరానగర్, మురకంబట్టు, దొడ్డిపల్లెలోని నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలోని పుట్టకు పూజలు చేసి పాలు పోశారు. అలాగే పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి.



బంగారుపాళెంలో..

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలో మంగళవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచి పుట్టలకు పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. కార్తీక మాసంలో నాలుగో రోజు వచ్చే నాగుల చవితికి అత్యంత విశిష్టత కలిగి ఉందని మొగిలి శివాలయ ప్రధానార్చకులు రెడ్డెప్ప గురుకుల్ తెలిపారు. ఉపవాస దీక్షతో పూజలు చేసినట్లైతే దోషాలు తొలగి శుభాలు కలుగు తాయని పేర్కొన్నారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పుట్టలకు పూజలు చేశారు.

అన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన సంతోష్‌కుమార్, సుమ 1,50,116 రూపాయలను ఆలయ అధికారులకు విరాళంగా అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కో వ్యక్తికి రూ.పది వేల చొప్పున.. 22 మందికి జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి మొత్తం 22 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు.

కె.పట్నంలో 'ఫ్యామిలీ డాక్టర్'



కె.పట్నంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు, గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో..

ఐరాల: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు–సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాలలో ..

గుడిపాల: మండల కేంద్రంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమహేష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సిబ్బంది సోనియా, చంద్రశేఖర్, సింధు, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

ఆక్రమణలు సరే..! విస్తరణ ఎప్పుడు?

చిత్తూరులో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీంతో నగరంలోని పలు రోడ్ల విస్తరణకు ప్రజల నుంచి డిమాండ్ వస్తోంది. గతంలో సంతపేట–కాణిపాకం రోడ్డు విస్తరణ చేసినట్లే ఈసారి పలమనేరు రోడ్డు, కొంగారెడ్డిపల్లె రోడ్లను విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

- చిత్తూరు–వేలూరు రోడ్డుపై ఆక్రమణల తొలగింపు
- కొంగారెడ్డిపల్లె వైపు రద్దీ
- నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు



వేలూరు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు–వేలూరు రోడ్డు దాదాపు 30 అడుగుల వరకు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. మునిసిపల్ కార్పొరేషన్ ప్రతి 20 ఏళ్లకోసారి రూపొందించే మాస్టర్ ప్లాన్ ప్రకారం.. చిత్తూరు–వేలూరు రోడ్డు జాతీయ రహదారి ప్రస్తుతం వంద అడుగులు ఉంది. అయితే ఈ రోడ్డులోని గిరింపేట దుర్గమ్మ ఆలయం నుంచి కలెక్టరేట్ కూడలి వరకు చాలా వరకు ఆక్రమణలకు గురైంది. దాదాపు రోడ్డుకు ఇరువైపులా 30 నుంచి 40 అడుగుల స్థలాన్ని చాలా మంది ఆక్రమించారు. ఫలితంగా పాదచారులకు, ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దీనిని గుర్తించిన మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఆదేశించారు. మంగళవారం పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తన సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించారు. వ్యాపారులు రోడ్డును ఆక్రమిస్తూ వేసిన షీట్లు, పలు తోపుడు బండ్లను అక్కడి నుంచి తీయించారు.

విస్తరణపై ఆశలు

నగరంలో మునిసిపల్ యంత్రాంగం ఆక్రమణలు తొలగించడంతో ఇపుడు అందరూ రోడ్ల విస్తరణపై చర్చించుకుంటున్నారు. ప్రధానంగా నగరంలోని కొంగారెడ్డిపల్లె షర్మన్ స్కూల్ నుంచి ప్రభుత్వ ఐటీఐ వరకు రోడ్డు కుదించుకుపోయింది. వాస్తవానికి ఇక్కడ వంద అడుగుల వెడల్పుతో రోడ్డు ఉండాలి. కానీ ప్రస్తుతం షర్మన్ పాఠశాల వద్ద 70 అడుగులు, కరుమారియమ్మ గుడి వద్ద 50 అడుగులు, పాత సర్వీస్ స్టేషన్ కూడలిలో 40 అడుగులు, ప్రభుత్వ ఐటీఐ వద్ద 60 అడుగుల వరకు మాత్రమే రోడ్డు ఉంది. పెరుగుతున్న జనాభా రీత్యా కొంగారెడ్డిపల్లె వైపు వెళ్లే వాహనాల సంఖ్య క్రమంగా పెరగడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. ప్రధానంగా ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 4–6 గంటల మధ్య ఇటువైపు చిన్న స్కూటర్‌పై వెళ్లడం కూడా సాహసమే అవుతుంది. రోడ్లపై పార్కింగులు, ఆక్రమణలు విచ్చలవిడిగా ఉన్నాయి. అలాగే పలమనేరు రోడ్డు కూడా వంద అడుగులు ఉండాలి. ఇక్కడా అదే పరిస్థితి. అంబేడ్కర్ కూడలి, గూలింగ్స్‌పేట కూడలి రోడ్డు వైపు రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ మొత్తం స్తంభించే పరిస్థితి నెలకొంది. వాహనాల క్రమబద్ధీకరణ పోలీసులకు రోజూ ఒక సవాల్‌గా మారుతోంది. అలాగే తిరుపతి రోడ్డులో మామిడి కాయల మండీ నుంచి చక్కెర ఫ్యాక్టరీ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. రెండు కార్లు ఎదురుగా వస్తే మిగిలిన వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితి. కళ్యాణ మండపాలకు వచ్చే వాళ్ల వాహనాలను రోడ్లపై ఆపేయడం, ఉన్న రోడ్డును ఆక్రమించి ప్రహరీలు వేసుకోవడమే దీనికి కారణం. ఇలాంటి తరుణంలో కార్పొరేషన్ అధికారులు రోడ్ల విస్తరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

చర్చించి నిర్ణయం

ఆక్రమణ తొలగింపుపై దృష్టి పెట్టాం. నగరానికి నలు వైపులా ఉన్న ఆక్రమణలు పూర్తిగా తొలగిస్తాం. ఆ తర్వాత రోడ్ల విస్తరణ ఎలా చేయాలి..? ఎక్కడెక్కడ చేయాలనే విషయాలను ప్రజా ప్రతినిధులతో మాట్లాడి ముందుకు వెళతాం. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరణ కచ్చితంగా చేయాల్సి ఉంది. అన్ని సమస్యలకు ఇదే పరిష్కారం.

–నాగేంద్ర, ఏసీపీ,
చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్